జగన్‌తోనే సంక్షేమం, అభివృద్ధి

- తల్లికి వందనం ఇస్తామంటూనే ఆంక్షలు
- జగన్ ప్రభుత్వంలో నాలుగేళ్ల పాటు ఆంక్షలు లేకుండా అమ్మ ఒడి అమలు



చేయూత చెక్కును అందజేస్తున్న దృశ్యం(ఫైల్)

దెందులూరు: అభివృద్ధి, సంక్షేమ పథకం ప్రారంభించి గత ఐదేళ్ల పాటు సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సంక్షేమం పరవళ్లు రుచిచూసిన ప్రజానీకం నేడు జగన్ ఉంటేనా అనే నానుడితో రోజులు వెళ్లదీస్తున్నారు. ఐదేళ్లపాటు అర్హులైన అన్ని వర్గాలకు సంక్షేమం అందజేసి ప్రజల మనస్సుల్లో స్థానం సంపాదించిన వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలనను ప్రజానీకం మననం చేసుకుంటున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది గడుస్తున్నా ఇంతవరకు సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయకపోవడంతో ప్రజానీకం తీవ్ర నిరసనను బహిరంగంగానే వ్యక్తపరుస్తున్నారు. ముఖ్యంగా విద్య, వైద్యానికి కూడా కూటమి ప్రభుత్వం ప్రాధాన్యత నివ్వకపోవడంతో ప్రజలు ప్రభుత్వాన్ని తీవ్రంగా విమర్శిస్తున్నారు. అమ్మ ఒడి పేరుతో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రూ. 15వేలు ఇవ్వగా, కూటమి ప్రభుత్వం అదే పథకానికి తల్లికి వందనం పేరుపెట్టి ఎంతమంది పిల్లలుంటే అన్ని రూ. 15వేలు ఇస్తామని బాకాలు ఊది మరీ చెప్పారు. కానీ ఇప్పుడు రూ.13వేలు మాత్రమే విడుదల చేయడంతో కూటమి ప్రభుత్వంపై తల్లిదండ్రులు కూటమి ప్రభుత్వంపై విమర్శలు చేసున్నారు. నలుగురు కలిస్తే చాలు జగన్ ఉంటేనా అనే మాట ప్రతి ఒక్కరి నోటా వినిపించడంతో జగన్ చరిష్మా ఏంటో తెలుస్తోంది. గత ఐదేళ్ల కాలంలో దెందులూరు, పెదవేగి, పెదపాడు, ఏలూరు రూరల్ మండలాలకు సంబంధించి రూ. 3300 కోట్లతో సంక్షేమం, అభివృద్ధికి మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి పాటుపడ్డారు.

క్యాలెండర్ ప్రకారం సంక్షేమం

ప్రజాసంకల్పయాత్ర ద్వారా ప్రజల కష్టాలను నేరుగా చూసి రూపొందించిన సంక్షేమాన్ని జగన్ ప్రభుత్వం క్యాలెండర్ ప్రకారం పూర్తిస్థాయిలో అమలు చేశారు. జగనన్న అమ్మ ఒడి, డ్వాక్రా వైఎస్సార్ సున్నా వడ్డీ, వైఎస్సార్ పెన్షన్ కానుక, వైఎస్సార్ చేయూత, వైఎస్సార్ బీమా, వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ కల్యాణమస్తు, వైఎస్సార్ రైతు భరోసా, వైఎస్సార్ సున్నా వడ్డీ, పంట రుణాలు, వైఎస్సార్ ఉచిత పంటల బీమా, రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ, జగనన్న వసతిదీవెన, జగనన్న విద్యాదీవెన, జగనన్న విదేశీ దీవెన, మత్స్యకార భరోసా, వైఎస్సార్ కాపునేస్తం, వైఎస్సార్ నేతన్ననేస్తం, జగనన్న చేదోడు, వైఎస్సార్ లా నేస్తం, వైఎస్సార్ వాహనమిత్ర, వైఎస్సార్ ఆరోగ్య ఆసరా, జగనన్న తోడు, ఈబీసీ నేస్తం, వైఎస్సార్ జలకళ, జగనన్న విద్యాకానుక, జగనన్న ట్యాబ్‌లు, జగనన్న కాలనీలు వంటి సంక్షేమం అర్హులందరి ఇంటి గుమ్మంలోకి నడిచివచ్చే పరిస్థితి ఉండేది. కానీ నేడు ఇస్తానన్న సూపర్ సిక్స్ పథకాల అమలకే కూటమి ప్రభుత్వం పురిటి నొప్పులు పడుతోందని ప్రజానీకం నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

సంక్షేమం అంటేనే జగన్



పేద ప్రజలందరికీ సంక్షేమం అందజేసిన వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అందరి గుండెల్లో నిలిచారు. దేశంలో ఎక్కడా లేని సంక్షేమం అందజేసి చరిత్రలో నిలిచారు. ముఖ్యంగా విద్యకు ఎంతో ప్రాధాన్యతను ఇచ్చారు. పేద పిల్లలను చదివించాలంటూ అమ్మ ఒడి ద్వారా రూ. 15వేలు అందజేశారు. అంతేకాకుండా ఆరోగ్యశ్రీ ద్వారా అన్ని రకాల రోగాలకు వైద్యసేవలందించడమే కాకుండా రూ. వెయ్యి ఖర్చుదాటితే ఆరోగ్యశ్రీని అమలుచేసే విధానం అందరికీ అండగా నిలిచింది.

– అంగడాల వెంకటేశ్వరమ్మ, వైఎస్సార్‌సీపీ దెందులూరు నియోజకవర్గ అధ్యక్షురాలు

సంక్షేమం, అభివృద్ధికి ప్రాధాన్యత



జగన్ ప్రభుత్వం హయాంలో సంక్షేమం, అభివృద్ధికి ప్రాధాన్యతనిచ్చి పేదలను ఆదుకున్నారు. గత ఐదేళ్లలో పేదింటి పిల్లలు ఖరీదైన విద్యనందుకుని ఉన్నత స్థాయికి చేరారు. ఎస్సీ వర్గాలకు ఉచిత విద్యుత్ అందించి వారిని కూడా అదుకున్నారు. ముఖ్యంగా పేదల సొంతింటి కలను నిజం చేస్తూ జగనన్న కాలనీల పేరుతో పట్టణంలో సెంటు, గ్రామాల్లో సెంటున్నర స్థలం ఇచ్చి ఇళ్ల నిర్మాణాలు చేశారు. అర్హత ఉంటే చాలు సంక్షేమం ఇంటి గడపలోకి వచ్చే విధంగా పాలన అందజేసిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుంది.

– సొంగ ప్రమీల, ఎంపీటీసీ, గాలాయగూడెం

క్లుప్తంగా

డిప్యూటీ తహసీల్దార్ ప్రియదర్శినికి సత్కారం



తహసిల్దార్‌గా బదిలీపై వెళుతున్న ప్రియదర్శినిని సత్కరిస్తున్న దృశ్యం

దెందులూరు: అంకిత భావంతో ఏ రంగంలో గుర్తింపు వస్తుందని దెందులూరు తహసీల్దార్ బి.సుమతి అన్నారు. శనివారం దెందులూరు తహసిల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్‌గా పనిచేస్తూ ఏలూరు రూరల్ మండలం తహసీల్దార్‌గా బదిలీపై వెళ్తున్న ప్రియదర్శిని రెవెన్యూ అధికారులు ఘనంగా సత్కరించారు. జ్ఞాపికను అందజేశారు. ఈ సందర్భంగా ప్రియదర్శిని మాట్లాడుతూ దెందులూరు మండలం తన సొంత మండలంగా భావిస్తున్నానని దెందులూరుతో తన బంధం విడదీయరానిది అన్నారు. తనకు పూర్తి సహాయ సహకారాలు ప్రోత్సాహం అందించిన అధికారులు సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

పేదల సంక్షేమమే లక్ష్యంగా కేంద్ర పథకాలు



కార్యక్రమంలో మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు విక్రమ్ కిషోర్

భీమడోలు: పేదల సంక్షేమమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేస్తుందని జిల్లా బీజేపీ అధ్యక్షుడు విక్రమ్ కిషోర్ అన్నారు. గుండుగొలనులో పీఎం నరేంద్ర మోడీ పాలన 11 ఏళ్లు పూర్తి చేసినందున శనివారం వికసిత్ భారత్ సంకల్ప సభను నిర్వహించారు. నియోజకవర్గ కన్వీనర్ శరణాల మాలతీరాణి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో విక్రమ్ కిషోర్ మాట్లాడుతూ దేశంలోని ప్రజలకు నరేంద్ర మోడీ నాయకత్వంలో సుపరిపాలన అందుతుందన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు బుర్రే మూర్తి, ప్రవీణ్‌కుమార్ పటేల్, మత్తే శ్రీనివాసశాస్త్రి, వెజ్జు ధర్మారావు పాల్గొన్నారు.

దెందులూరులో..

దెందులూరు: వికసిత్ భారత్ లక్ష్యాలు సాధించాలని బిజెపి ఏలూరు జిల్లా అధ్యక్షుడు విక్రమ్ కిషోర్ అన్నారు. శనివారం కొమరేపల్లిలో పార్టీ దెందులూరు నియోజకవర్గం అధ్యక్షుడు గుమ్మడి చైతన్య అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. సమావేశంలో మండల బీజేపీ అధ్యక్షురాలు లక్ష్మీప్రసన్న, మండల మాజీ అధ్యక్షుడు బుజ్జి గోపాల్, పార్టీ నాయకులు పి.నాగమోహన్, ఆంజనేయులు, ప్రభు రాజు పాల్గొన్నారు.

గిట్టుబాటు ధర కల్పించాలి

టి.నరసాపురం: పొగాకు పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి అన్నారు. అనుబోలు మురళి అధ్యక్షతన జరిగిన సీపీఎం మండల కమిటీ సమావేశంలో రవి మాట్లాడారు. పొగాకు కొనుగోలు చేయకుండా సిండికేట్‌గా రైతులకు నష్టం చేకూర్చే విధంగా కొనుగోలు కేంద్రాల్లో దళారులు వ్యవహరిస్తున్నారన్నారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకుని పొగాకు రైతుకు గిట్టుబాటు ధరలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఆర్ పార్టీ కార్యదర్శి మడకం సుధారాణి, పార్టీ మండల కమిటీ సభ్యులు మడకం కుమారి, బరగడ కుమారి, ముంద్రు శిరీష, కార్యకర్తలు పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రత ద్వారా దోమల నివారణ

చింతలపూడి : పరిసరాల శుభ్రత ద్వారా దోమల నివారణ చేపట్టవచ్చునని చింతలపూడి మలేరియా సబ్ యూనిట్ అధికారి ఎన్‌పి ప్రసాద్ సూచించారు. శనివారం స్థానిక ఎస్సీ బాలుర వసతి గృహంలో మలాథియాన్ స్ప్రేయింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చింతలపూడి మలేరియా సబ్ యూనిట్ పరిధిలోని 18 ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాల్లో కీటక జనిత వ్యాధులకు గురికాకుండా ముందస్తు చర్యల్లో భాగంగా మలాథియాన్ ద్రావణం పిచికారి చేసినట్లు చెప్పారు. ప్రస్తుతం తొలకరి వర్షాలు ప్రారంభమైన నేపథ్యంలో ప్రతి ఒక్కరూ దోమల నియంత్రణ చేపట్టాలన్నారు. ఇంటి పరిసరాల్లో మురుగు నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో వసతి గృహ అధికారులు, మలేరియా హెల్త్ అసిస్టెంట్ కె శ్రీనివాస్ పాల్గొన్నారు.

పారిజాతగిరికి పోటెత్తిన భక్తులు

జంగారెడ్డిగూడెం: స్థానిక పారిజాతగిరి శ్రీవేంకటేశ్వరస్వామి వారి ఆలయానికి శనివారం భక్తులు అధిక తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. స్వామి వారికి సుప్రభాత సేవ మొదలుకుని తోమాల సేవ, తీర్థప్రసాద గోష్ఠి, ఆరాధన, బాలభోగ నివేదన తదితర పూజలు అర్చకులు నల్లూరి రవికుమారాచార్యులు ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. ఆలయ గిరి ప్రదక్షిణ సిమెంట్ రోడ్డుకు ఇరువైపులా దమ్మపేటకు చెందిన వల్లభ నర్సరీ, శ్రీ లక్ష్మీనరసింహా నర్సరీ, సాయి కృష్ణ నర్సరీ, నరసన్నపాలెంకు చెందిన శ్రీ ప్రకృతి క్లోన్స్ యాజమాన్యం సహకారంతో 300 మామిడి మొక్కలు నాటినట్లు ఆలయ ఈవో మానికల రాంబాబు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

భీమడోలు: భీమడోలు 33 కేవీ సెక్షన్ పరిధిలోని భీమడోలు, గుండుగొలను, ఆగడాలలంక, అంబర్‌పేట సబ్‌స్టేషన్ల పరిధిలో చెట్ల నరికివేత, మరమ్మతుల నేపథ్యంలో ఆదివారం ఉదయం 8.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ శివాజీ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఓ ప్రకటనను విడుదల చేవారు. గుండుగొలను, సూరప్పగూడెం, నాగహనుమాన్ ఇండస్ట్రియల్ ఫీడర్లు, సూరప్పగూడెం, పోలసానిపల్లి అగ్రి కల్చరల్ ఫీడర్లకు, సూరప్పగూడెం హెడ్ క్వార్టర్స్, గుండుగొలను, రత్నాపురం, ఆగడాలలంక ఫీడర్ల పరిధిలోని గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని పేర్కొన్నారు.

ఏఎస్‌డబ్ల్యూఓగా శ్రీనివాస్



ఏఎస్‌డబ్ల్యూవో శ్రీనివాస్

దెందులూరు: ఏలూరు సాంఘిక సంక్షేమ శాఖ ఏఎస్‌డబ్లుఓగా శ్రీనివాస్ నియమితులయ్యారు. దేవరపల్లి ఏఎస్‌డబ్లుఓగా పని చేస్తూ ఏలూరు ఏఎస్‌డబ్లుఓగా బదిలీపై వచ్చారు. శనివారం ఆయన దెందులూరులో మాట్లాడుతూ దెందులూరు, ఏలూరు, పెదపాడు, పెదవేగి, ఏలూరు రూరల్ మండలాల్లోని హాస్టళ్ల అభివృద్ధి, సమస్యల పరిష్కారానికి అందరు సహాయ సహకారాలతో కృషి చేస్తానని ఏఎస్‌డబ్లుఓగా శ్రీనివాస్ అన్నారు.

నాడు ఆహ్లాదం.. నేడు కళావిహీనం



పూళ్ల నుంచి ఎంఎంపురం రోడ్డులో ఆహ్లాదకరంగా ఉన్న చెట్లు (ఫైల్)



పూళ్ల నుంచి ఎంఎంపురం వరకు విద్యుత్ స్తంభాలు వేసిన ప్రాంతంలో చెట్లు తొలగించిన దృశ్యం

భీమడోలు: నీడనిచ్చే చెట్లు లేకపోతే జీవితం కఠినంగా ఉంటుంది. చెట్లు ప్రకృతి మనకిచ్చిన బహుమతి... వాటిని అభివృద్ధి సాకుతో తొలగిస్తే వేసవి తీవ్రత ఏ తరహాలో ఉంటుందో ప్రజలకు అర్థమైంది పూళ్ల నుంచి ఎంఎంపురం వరకు గల రహదారి వెంబడి 20 ఏళ్ల కితం రోడ్డుకు ఇరువైపులా నీడనిచ్చే మొక్కలు నాటారు. అవి నేటికి వృక్షాలు మారాయి. ఎంఎం పురంలో త్రీఫేజ్ విద్యుత్ మంజూరు కావడంతో విద్యుత్ శాఖ విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేసింది. దీనితో ఓ వైపు అడ్డుగా ఉన్న వృక్షాలను అవసరం మేరకు తొలగించారు. దీనితో ఆహ్లాదకరంగా ఉన్న రోడ్డు బోసిపోయింది. చెట్లు నరకకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాల్సిన సంబంధిత అటవీశాఖ, విద్యుత్, పంచాయతీ అధికారులు వాటిని నరకడానికి మొగ్గు చూపారని గ్రామస్తులు బాహాటంగా విమర్శిస్తున్నారు. దీనితో సుమారు 4 కిలో మీటర్లు ఉండే ఈ రహదారిలో 3 కిలోమీటర్ల మేర ఉన్న ఈ చెట్లలో ఒక వైపు నరికి వేశారు. ఈ గ్రామంలో భక్తుల కోర్కెలు తీర్చే భవానమ్మ ఆలయం ఉంది. ఈ ఆలయానికి అన్ని వేళల్లో భక్తులు అమ్మవారిని దర్శించుకునేందుకు వస్తుంటారు. వేసవిలో అమ్మవారిని దర్శించుకోవడం పాటు మొక్కులు తీర్చుకుంటారు. దీంతో ఆలయానికి వచ్చే భక్తుల వేసవి తాపాన్ని ఈ చెట్లు తీర్చేవి. కొంత సేపు సేదతీరి తమ గమ్యానికి వెళ్లేవారు. ఈ వేసవిలో ఉక్కబోత, వేసవి తీవ్రతలతో వారంతా ఆందోళన చెందారు. గతంలో ఉన్న ఆహ్లాదకరమైన వాతావరణం కానరాకపోవడంతో భక్తులు, పర్యావరణ ప్రియులు ఆందోళన చెందుతున్నారు. ఇకనైనా నీడనిచ్చే చెట్లు మనకు అండగా ఉండే వ్యక్తులుగా భావించి వాటిని తొలగించే తరుణంలో పునరాలోచించాలని ప్రజలకు వేడుకుంటున్నారు.

మహిళల భద్రతకు అవగాహన

ఏలూరు టౌన్: ఏలూరు నగరంలో మహిళలు, యువతులు, బాలికలు, విద్యార్థినులు అత్యవసర పరిస్థితుల్లో శక్తి యాప్‌ను వినియోగించుకోవాలని మహిళా స్టేషన్ ఎస్సై క్రాంతిప్రియ సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో, ఏదైనా అపాయం వస్తే వెంటనే శక్తి యాప్‌ను వినియోగించాలని, లేదా 112 టోల్ ఫ్రీ నెంబర్ లేదా 79934 85111కు ఫోన్ చేయాలని కోరారు. ఏలూరులో శక్తి పోలీస్ టీమ్‌తో కలిసి పార్కులు, మహిళలు అధికంగా ఉండే ప్రాంతాలు, విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్నారు. శక్తి యాప్‌లో ఎస్‌వోఎస్ అలర్ట్‌తో తక్షణమే పోలీస్ సహాయం అందుతుందని తెలిపారు. ఈ సందర్భంగా సమాజంలో ప్రజలకు ఇబ్బందులకు గురిచేసే ప్రతి విషయంలోనూ మహిళలకు అవగాహన కల్పిస్తున్నారు.

తల్లికి వందనం వారికే ఇవ్వాలి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): తల్లికి వందనం పథకాన్ని ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు మాత్రమే వర్తింపజేయాలని పీఆర్‌టీయూ నాయకులు ఎమ్మెల్యే బడేటి చంటిని కోరారు. ఈ మేరకు శనివారం చంటి క్యాంపు కార్యాలయంలో కలుసుకున్న పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు పువ్వుల ఆంజనేయులు బంధింత వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు మాత్రమే ఈ పథకాన్ని వర్తింప చేస్తే ప్రభుత్వ పాఠశాలలు పరిరక్షించబడతాయన్నారు. పాఠశాలలు పునఃప్రారంభమౌతున్న ఈ సమయంలో సొమ్ము జమ అవుతుండడం ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల చేరికపై ప్రభావం చూపుతుందన్నారు. ప్రభుత్వ విధానాల ప్రకారం అంతగా ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులను కూడా ప్రోత్సహించాలనుకుంటే వారికి రూ. 5 వేలు చొప్పున జమ చేసి ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలని కోరారు.

విమాన ప్రమాద మృతులకు సంతాపం



మృతులకు సంతాపం వ్యక్తం చేస్తున్న వైఎంహెచ్‌ఏ ప్రతినిధులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): అహ్మదాబాద్‌లో ఇటీవల ప్రమాదంలో నేల కూలిన ఎయిర్ ఇండియా విమాన ప్రమాదంలో మృతి చెందిన వారికి నగరానికి చెందిన హిందూ యువజన సంఘం సంతాపం తెలిపింది. శనివారం స్థానిక వైఎంహెచ్ఏ హాలులో ఏర్పాటు చేసిన సభలో తొలుత సంఘ సభ్యులు మృతుల ఆత్మకు శాంతి చేకూరాలని రెండు నిమిషాల పాటు మౌనం పాటించి, అంజలి ఘటించారు. ఈ సందర్భంగా సంఘ మేనేజ్మెంట్ కమిటీ అధ్యక్షుడు యర్రా సోమలింగేశ్వరరావు మాట్లాడుతూ ఎవరు ఊహించని ఘోర ప్రమాదమని, మరణించిన వారి ఆత్మలకు శాంతి చేకూరాలని కోరుతున్నామని చెప్పారు. మృతులకు సంఘ ఉపాధ్యక్షుడు ఎంవీవీఎస్ నాగేశ్వరరావు, వేమా కోటేశ్వరరావు, ఇన్‌చార్జి ప్రధాన కార్యదర్శి గుడిపాటి లలితా శర్మ, సహాయ కార్యదర్శి సీహెచ్ సాయి తేజ, సభ్యులు శలా రాజాబాబు, రేవూరి శివశంకర వరప్రసాద్, ప్రత్యేక ఆహ్వానితులు వేణుగోపాల్ లునాని, కార్యనిర్వాహక కమిటీ అధ్యక్షుడు యిరదల ముద్దుకృష్ణ, ఉపాధ్యక్షుడు ఎల్ వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి మజ్జి కాంతారావు, కేబీ రావు, బొప్పన వెంకట రాజా, కె.హేమంత్ కుమార్, ఎ.పార్వతి రామచంద్రన్, ఎం సూర్యనారాయణ, పిలగల కొండలరావు, ఇ.హేమసుందర్, ఎంవీ రవీంద్ర, మారం హనుమంతరావు నివాళులర్పించారు.

చింతలపూడి ఎక్స్‌ప్రెస్ బస్సును పునరుద్ధరించండి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఏలూరు నుంచి చింతలపూడికి వెళ్లేందుకు ఎక్స్‌ప్రెస్ బస్సు సర్వీసును పునరుద్ధరించాలని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు పువ్వుల ఆంజనేయులు ఆర్టీసీ విజయవాడ జోన్ చైర్మన్ రెడ్డి అప్పల నాయుడును కోరారు. శనివారం అప్పల నాయుడును ఆయన క్యాంపు కార్యాలయంలో కలిసిన ఆంజనేయులు చింతలపూడి రూట్‌లో లిమిటెడ్ హాల్ట్స్‌తో కూడిన ఎక్స్‌ప్రెస్ బస్ సర్వీసు వేస్తే ఏలూ రు నుంచి ఉదయం పాఠశాలలకు వెళ్లే ఉద్యో గ, ఉపాధ్యాయులకు సమయం కలిసివస్తుందన్నారు. దీనిపై అప్పల నాయుడు స్పందించి ఆర్టీసీ అధికారులతో చర్చించి సర్వీసు ఏర్పా టు చేయడానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యం



పోలసానిపల్లిలో సామూహిక యోగా ప్రదర్శనలో పాల్గొన్న తహసీల్దార్ బి.రమాదేవి, సర్పంచ్ షేక్ రహీమాబేగం

భీమడోలు: యోగా జీవితంలో నిత్యకృత్యం కావాలని, తద్వారా సంపూర్ణ ఆరోగ్యవంతులవుతారని భీమడోలు తహసీల్దార్ బి.రమాదేవి, ఎంపీడీఓ సీహెచ్ పద్మావతిదేవి అన్నారు. పోలసానిపల్లి, భీమడోలు, గుండుగొలను గ్రామాల్లో యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం సామూహిక యోగా ప్రదర్శన కార్యక్రమాలు జరిగాయి. పోలసానిపల్లిలో సర్పంచ్ షేక్ రహీమాబేగం ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద గ్రామస్తులతో కలిసి తహసీల్దార్, సర్పంచ్‌లు యోగాసనాలు వేశారు. భీమడోలు పంచాయతీ వద్ద ఎంపీడీఓ సీహెచ్ పద్మావతిదేవి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ యోగా కార్యక్రమంలో యోగా ట్రైనర్ పీవీవీ సత్యనారాయణ యోగాసనాలు వేయించారు. ఆయా కార్యక్రమాల్లో మాజీ ఎంపీపీ శిరిబత్తిన కొండబాబు, గ్రామ కార్యదర్శులు కేవీ తనూజ, జె.జయరామకృష్ణ, గ్రామ పెద్దలు గంజి సుబ్బారావు, పాకి న సత్యనారాయణ, ఎం.శ్రీనుబాబు పాల్గొన్నారు.

ఉంగుటూరులో..

ఉంగుటూరు: యోగా వల్ల బహుళ ప్రయోజనాలు ఉన్నాయని, ప్రతి ఒక్కరూ యోగా చేయడం అలవర్చుకోవాలని జిల్లా పంచాయతీ అధికారి ఎ.అనురాధ అన్నారు. శనివారం ఉంగుటూరు పంచాయతీ సామాజిక భవనంలో యోగాసనాలు వేశారు. ఈ సందర్భంగా డీపీఓ ఎ.అనురాధ యోగా ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రాజ్‌మనోజ్, ఎంపీపీ గంటాశ్రీలక్ష్మి, ఎంపీడీఓ ఆఫీస్ సూపరింటెండెంట్ ఆంజనేయులు, కార్యదర్శి బొడ్డురవికుమార్ తదితరులుపాల్గొన్నారు. యోగా మాస్టర్ ట్రైనర్సు పీవీ పెద్దిరాజు, మంద జయలక్ష్మి లు అభ్యాసకులతో యోగాసనాలు వేయించారు.

యోగాతోనే మానసిక ప్రశాంతత

దెందులూరు : యోగాతో మానసిక ప్రశాంతత, శారీరక ధృఢత్వం లభిస్తుందని దెందులూరు ఎంపీడీవో కే.శ్రీదేవి అన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు శనివారం దెందులూరులో మూడు సచివాలయాల పరిధిలో శిక్షణ పొందుతున్న 64 మంది గారపాటి హైమావతి దేవి ఉన్నత పాఠశాలలో యోగాలో పాల్గొన్నారు. ఫిజికల్ డైరెక్టర్ రాధా వివిధ ఆసనాలను ప్రదర్శకులతో చేయించారు.



ఉంగుటూరు పంచాయతీ సామాజిక భవనంలో యోగా చేస్తున్న దృశ్యం



యోగాసనాలు వేస్తున్న అధికారులు

గిరిజనులకు పట్టాలివ్వాలి

కుక్కునూరు: విలీన మండలాల్లో పోడు నరికి సాగు చేసుకుంటున్న గిరిజనులకు పోడు పట్టాలివ్వాలని కోరుతూ సీపీఐ ఆధ్వర్యంలో శనివారం కుక్కునూరు ఫారెస్ట్ రేంజర్ కృష్ణకుమారికి వినతిపత్రం అందించారు. ఎన్నో ఏళ్లుగా పోడుభూముల పైన ఆధారపడి జీవిస్తున్న గిరిజన రైతులకు పట్టాలివ్వాలని కోరారు.